## పేషెంట్ చెప్పే కథలు

# సాలెగూడు



డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి

"ఇలా తప్ప మరోలా బ్రతకలేనా?" మరోసారి ప్రశ్నించుకుంది కళావతి. కోమలత్వాన్ని కోల్పోని ఆమె ముఖం వాడిపోయి వుంది. కళ్ళు సిగ్గుతో వాలిపోయాయి. "ఇంత పాడు బ్రతుకు బ్రతక్కపోతేనేం?" అని పొడిచినట్లుండే లోకుల చూపులు తనమీద పడిన ప్రతిసారీ తనను తానే ప్రశ్న వేసుకుంటుంది కళావతి. ఎంత ఆలోచించినా, ఎంత తరచి చూసినా ఎప్పుడూ జవాబొక్కటే మిగులుతుంది. "ఇలా తప్ప మరోలా బ్రతికే మార్గం లేదు నాకు. ఇంతకంటే గౌరవంగా, సుఖంగా, నిశ్చింతగా బ్రతికేదారి లేదు నాకు."

తనను కన్నతల్లి బ్రతుకు తుఫానులో ఎటువైపుకు విసిరివేయబడి ఎంత గౌరవంగా, ఎంత సుఖంగా బ్రతుకుతూందో తనకు తెలియదు. ఆమె తొందరపాటు ఫలితంగా ఊపిరి నింపుకుని బ్రతుకుతున్న తనింత హేయమైన జీవితాన్ని గడుపుతూంది. పసికందుగా వుండగానే తనను కొనుక్కుని సాకిన సుబ్బమ్మ ఆమె కలవాటైన జీవన పథంలోకి బలవంతంగా నెట్టేసింది తనను. అనుక్షణం తనను చుట్టిన వాతావరణాన్ని అసహ్యించుకుంటూనే, ఆ వాతావరణం నుంచి దూరంగా పారిపోయి మర్యాదగా బ్రతకాలనుకుంటూనే, తనుచేసిన ప్రయత్నాలన్నీ విఫలమయి ఈ సాలెగూటిలో నుంచి బయట పడలేకపోయింది.

"గర్భాశయం బాగా పాడయింది. బాగా విశ్రాంతి తీసుకోవాలి. బలమైన ఆహారం తీసుకోవాలి. అన్నిటికంటే ముఖ్యం ట్రీట్‌మెంట్ పూర్తయేదాకా భర్తతో కలవకూడదు." డాక్టరమ్మ చెప్తున్న జాగర్తలువిని సుబ్బమ్మముఖం వెలవెలాబోయింది.

"ఇవన్నీ ఎట్లా జరుగుతాయమ్మా మాకు?" ఒక నిమిషం పోయాక సుబ్బమ్మ గొంతు పెగిలింది.

"పిల్లది రికార్డుడాన్సులకెళ్తే తప్ప పూట గడవదు. రెండు నెల్లనుంచీ బట్టల జబ్బుతో బాధపడుతున్నా ప్రతి రాత్రి ఎవడో ఒకడొచ్చి దాని ప్రాణంతీస్తాడు. కానని బ్రతకలేని పాపిష్టి జన్మ మాది" విచారంగా తనకు తాను చెప్పుకుంటున్నట్లుగా అంటున్న సుబ్బమ్మని, తనను జాలిగా చూసింది డాక్టరమ్మ. సుబ్బమ్మ మాటలు విని తన తల భూమిలోకి వంగిపోయింది. తను గడుపుతున్న నికృష్ట జీవితం అతి భయంకరంగా ముందు నిలిచినట్టయింది. తిరిగి సుబ్బమ్మ మాటలు వినిపించి ఆలోచనల్లో నుంచి బయటపడింది కళావతి.

"మీరు చెప్తే తప్పేదేముంది? అట్లాగే ఏదో తంటాలుపడి మీరు చెప్పినట్లే జరిపిస్తాను. కాస్త మంచి మందులు వ్రాసి పిల్లని తొందరగా కోలుకొనేలా చూడండమ్మా!" కన్నీళ్ళతో అర్థిస్తున్న సుబ్బమ్మ వంక ఆశ్చర్యంగా చూచింది. కళావతి. తన కలల్ని, కోరికల్ని నిర్దాక్షిణ్యంగా తుంచేసి కటువైన జీవితసత్యాల్ని పరమ మోటుగా తన ముందుంచిన ఈ రాక్షసిలో యింత మెత్తదనంవుందా?! ఎప్పుడూ కసుర్లు, తిట్లు తప్ప ప్రేమ, లాలింపులాంటి పదాలే ఎరుగకుండా, బ్రతుకు చక్రపు పళ్ళమధ్య నలిగిపోతూ మార్దవాన్ని, లాలిత్యాన్ని కోల్పోయిన ఈ గయ్యాళి దానిలో ఈ మాత్రపు ప్రేమైనా మిగిలుందా?! తనకోసం ఆరాటపడే ప్రాణి, తన కోసం దుఃఖపడే హృదయం ఈ లోకంలో కనీసం ఒక్కటుందా?! గుండె లోతుల్లోంచి ఏడుపు తన్నుకొస్తూంది కళావతికి.

"పద" డాక్టరమ్మ వ్రాసిచ్చిన మందుల చీటీ తీసుకుని కళావతి భుజం చుట్టూ చెయ్యేసి పొదవుకుని బయటకు తీసుకు వెళ్ళింది సుబ్బమ్మ. తనను చుట్టిన సుబ్బమ్మ చేతి వంక నిశ్చలంగా చూస్తూంది కళావతి. ఒక క్షణం క్రిందటి వరకు ఈ చేతి స్పర్శంటే పరమ రోత తనకు. ఈ చెయ్యే ఉత్సాహంతో ఉరకలు వేస్తూ తను కట్టుకుంటున్న కోరికల కోటల్ని కూలదోస్తూ తనచేతిలోని పుస్తకాల్ని లాగేసింది. ఈ చెయ్యే తన శరీరాన్ని విక్రయ వస్తువుగా మార్చి వ్యాపారం చేసింది. ఈ చెయ్యే బలవంతాన తన బ్రతుకును పెద్దపాము నోట్లో పడేసింది.... ఈ చెయ్యి తన మీద పడితే మచ్చలపాము తననుచుట్టుకుంటున్నట్లుగా జుగుప్సతో జలదరించేది తన శరీరం.... కాని.... ఈ క్షణంలో ఈమె హృదయంలో ఎన్ని స్వార్థపు టాలోచనలైనా వుండనియ్. ఈమె కనబరచిన రవ్వంత ఆదరణ తన కెంతో ఊరట కలిగిస్తూంది.

"కళా! సిరిపురం షావుకారు కొడుకు చంద్ర కోసం తిరుగుతున్నాడు." రిక్షా తమ వీధి మలుపు తిరుగుతూ వుండగా అంది సుబ్బమ్మ.

"ఒద్దొద్దు" ఆదుర్దాగా అంది కళావతి. "ముక్కుపచ్చలారని పిల్ల దాన్ని యిప్పటి నుంచి ఈ నరకంలోకి లాగొద్దు. ఎలాగోలా గడుపుకుందాం. ఎక్కడో ఒకచోట అప్పు పుట్టించుకురా. బ్రతికి బాగుంటే ఎప్పటికో ఒకప్పటికి తీర్చుకుందాం" చంద్ర కూడా తనలాంటి దురదృష్టవంతురాలే. ఎగిరిపోడానికి తనకే రెక్కల్లేవు. ఆ పిల్లకేం సహాయ పడుతుంది తను!! అయినా సాధ్యమైనంత ఎక్కువ కాలం ఈ బాధలకు దూరంగా వుంచాలని తాపత్రయం.

"ఎప్పటికి నీ ఒళ్ళు బాగుపడేను! ఎప్పటికీ అప్పులన్నీ తీరేను!" నిట్టూర్చింది సుబ్బమ్మ.

సుబ్బమ్మ దొరికినచోటల్లా అప్పులు తెచ్చి ఇల్లు నడుపుతూంది. కళావతికి డాక్టరమ్మ చెప్పిన మందులు, ఆహారం, విశ్రాంతిని సమకూర్చడానికి ప్రయత్నిస్తూంది. కళావతి అనారోగ్యంవల్ల ఎంతో నష్టంకలుగుతూందనే దుగ్ధవున్నా ఏమారుమూలో దాగున్న పెంచిన ప్రేమ ఆమె గురించి పరితపించేలా చేస్తూంది. చంద్రను ముగ్గులోకి దింపడానికి చంద్ర, కళ యిద్దరూ కలిసి ఎదురు తిరగడంతో విధిలేక గొణుక్కుంటూనే, యిద్దర్నీ కలిపి తిడుతూనే అప్పులు తెస్తూంది.

కళావతి కొంచెం కోలుకుంటూవుండగానే సుబ్బమ్మకో రోజు హఠాత్తుగా ప్రాణమ్మీదకొచ్చింది. ఎప్పుడూ జ్వరమే చీదెరుగని సుబ్బమ్మ పడిపోయేసరికి కళ, చంద్ర నీటి బయట చేపల్లా అయిపోయారు.

"పాపం! ఏ ఆరోగ్యం కోసం ఎంతో తాపత్రయ పడిందారోజు." సుబ్బమ్మకు ఇంజక్షన్ చేస్తూ అంటున్న డాక్టరమ్మ వంక గాజు కళ్ళతో చూసింది కళావతి....

డబ్బు కావాలి.... అర్జంటుగా డబ్బు పుట్టించుకు వస్తేగాని సుబ్బమ్మ ప్రాణాలని నిలిపే మందుల్ని కొనలేం.... సుబ్బమ్మ చాటున డబ్బుతో ప్రత్యక్ష సంబంధం లేకుండా బ్రతికిన కళావతికీ పరిస్థితి గాభరా పుట్టిస్తూంది....ఆలోచనలో పడిన కళావతి ఒక నిశ్చయానికి వచ్చినదానిలా గబగబా చంద్ర చేతిలో మందుల చీటీ లాక్కుని బయటకు పరుగెత్తింది.

గంటలో సుబ్బమ్మకు కావలసిన మందులు తీసుకొచ్చింది కళ. అప్పటికే చెయ్యవలసిన వైద్యం చేస్తున్న డాక్టరమ్మకు కృతజ్ఞతతో నమస్కరించింది.

రెండు రోజులు కళ్ళల్లో వత్తులేసుకు కూర్చుని సుబ్బమ్మకు సేవలు చేసింది కళావతి. సుబ్బమ్మకు స్పృహవచ్చి కోలుకుంటూ కళ తనకు చేస్తున్న ఉపచారాల్ని చూసి వలవలా ఏడ్చేసింది.

"ఎక్కడ ఏయింట్లో పుట్టావో. ఎంత బాగా బ్రతకాల్సిన దానివో. నీ ఖర్మకాలి నా చేతిలో పడ్డావు. నీ బ్రతుకుని బుగ్గి చేశానే అమ్మా! దేవుడు నన్ను నరకానికే పంపిస్తాడే" శరీరంలో సగభాగం చచ్చుబడిపోయిన సుబ్బమ్మవంక నిస్తేజంగా చూస్తూంది కళావతి సుబ్బమ్మ అన్న మాట నిజమే. అయితే ఆడపిల్లల బ్రతుకుల్ని బుగ్గిచేసిన నరరూప రాక్షసులతో నరకం ఈపాటికే నిండిపోయుండాలి. ఆడపిల్లల రక్తమాంసాలతో వ్యాపారాన్ని సాగించే క్షుద్రులు నరకంలో పాదం మోపితే నరకం కూడా అపవిత్రమవుతుందేమో బహుశా!

"కళా! యింటికెళ్ళి కాస్త ముద్దతిని పడుకో. చంద్ర వుంటుందిక్కడ." బలవంతాన యింటికి పంపంది సుబ్బమ్మ

మునిమాపువేళ యింటికి వెళ్ళిన కళ యింకా చీకటి తెరలు విచ్చుకోకుండానే హాస్పటల్‌కు తిరిగొచ్చింది. బాధతో విలవిలలాడుతూ హృదయ విదారకంగా ఏడుస్తూన్న కళ దగ్గరకు ఆదుర్దాగా వచ్చింది డాక్టరమ్మ.

"నేనీ బాధకు తట్టుకోలే నమ్మగారూ! నేను చచ్చిపోతాను. ఈ బాధ లేవీ తెలీకుండా చచ్చిపోడానికి ఇంజక్షన్ నివ్వండమ్మగారూ!" దీనంగా అర్థిస్తూ ఏడుస్తున్న కళ తనను చూస్తూ వికటాట్టహాసం చేస్తున్న పేదరికం, డబ్బు అప్పిచ్చినప్పుడు పెట్టిన షరతును గుర్తుచేస్తూ తన మీదకు లంఘిస్తున్న క్రూరమృగం కళ్ళముందు నిలిచి కంపించిపోయింది. కడుపులో గునపాలతో పొడుస్తున్నట్లు వెర్రిబాధ.... మెలికలు తిరిగిపోతూ ఏడుస్తూంది కళావతి.... చీకటి యింకా చిక్కగానే వుంది.


## జలుబు వల్ల ఓ మంచి రోజును పాడవనివ్వకండి



### జలుబును పోగొట్టుకోవచ్చు

ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, తలభారం, గొంతు నొప్పి, గుండెలో కఫం చేరడం లాంటివన్నీ మీ మంచి రోజుల్ని పాడు చేస్తాయి. అయితే, ఈ లక్షణాలుగల జలుబునుంచి ఉపశమనానికి ఓ మార్గం ఉంది.

### జలుబు మందుతో వాటిని ఎదుర్కోండి

ఏ ఇతర జబ్బుకో చికిత్స చేసినట్టు జలుబుకి చికిత్సచేస్తే చాలదు. జలుబు లక్షణాలకు లోనైన అన్ని చోట్లా ఒకేమారుగా పనిచేసే ప్రత్యేకమైన మందే వాడండి.

### కోల్డరిన్ కేవలం జలుబు కోసమే

మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అన్ని జలుబు లక్షణాలనుంచి ఉపశమనం కలిగిస్తుంది కోల్డరిన్. దీనిలోని ప్రత్యేకమైన ఔషధ పదార్థాలు జలుబు లక్షణాలుగల అన్నిచోట్లా కలిసికట్టుగా పనిచేస్తాయి. పైగా మీ శరీరంలో నిరోధక శక్తిని పెంచే విటమిన్ సి దీనిలో ఉంది. మీకు జలుబు చేస్తే, దానికి ప్రత్యేకమైన జలుబు మందే వేసుకోవడం ఉత్తమం



# కోల్డరిన్

జలుబు కోసం ప్రత్యేకంగా తయారుచేయబడింది

CASBC-64-232 TL